రోడ్డు పైనే దుకాణాలు

- అనధికారికంగా వ్యాపారాలు
- వాహనచోదకుల అవస్థలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో రహదారులనాక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆటోనగర్ నుంచి కెనరాబ్యాంకుకు వెళ్లే మలుపు వద్ద భారీ చికెన్ షాపు, కెనరాబ్యాంకు ఎదురుగా టిఫిన్ స్టాల్, పలు చోట్ల మెస్‌లు, ఆటోనగర్ బీ, డీ బ్లాక్‌లలో.. ఇలా ప్రతీ చోట వ్యాపారాలు నిర్వహిస్తూ ఆటోనగర్‌లోని ఖాళీ స్థలాలను ఆక్రమించేస్తున్నారు. పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు ఐలా సిబ్బంది సహకారంతోనే ఇదంతా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా కోట్లాది రూపాయలతో ఆటోనగర్‌లో రోడ్లు నిర్మిస్తే, ఈ దుకాణాలతో మళ్లీ ఇరుగ్గా మారిందని వాహనచోదకులు చెబుతున్నారు. అయితే, ఇక్కడ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారు తాము అద్దెలు కడుతున్నామని చెప్పడం గమనార్హం. ఎవరికి కడుతున్నారనేది ప్రశ్నార్థకం.

ఏళ్ల తరబడి దుకాణాలు

పాత ఎస్‌ఆర్‌ఎంటీ రోడ్డులో ఎస్‌ఎఫ్‌ఎస్ పార్క్ వద్ద కొద్ది సంవత్సరాలుగా 15 నుంచి 20 దుకాణాలను అనధికార వ్యక్తులు ఏర్పాటు చేసుకుని, లక్షలు అర్జిస్తున్నారు. వీటిపై కొందరు వ్యక్తులు తమ అజమాయిషీని కొనసాగిస్తూ దందా నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఆటోనగర్‌లోని ఎస్‌ఆర్‌ఎంటీ రోడ్డులో దుకాణాలు


ఆటోనగర్‌లో..

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ అధికారి కుటుంబానికి సాయం


మృతుని కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న జీఎంలు బెహరా, వాణిశ్రీ

ఉక్కునగరం: ఇటీవల తిరుమలలో గుండెపోటుతో మృతి చెందిన స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ జనరల్ మేనేజర్ వి. సుధాకర్ కుటుంబానికి ఉక్కు అధికారుల సంఘం (సీ) సాయం అందజేసింది. శుక్రవారం సీ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిజైన్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి యు.ఎస్. బెహరా చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు రూ. 4 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో విభాగం జీఎం జె. వాణిశ్రీ, సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, కార్యవర్గ సభ్యులు టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాటుకు వినతి


అనంత నాయక్‌ను కలిసి నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగులకు ప్రత్యేకంగా అసోసియేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్‌ను ఉక్కునగరం ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎం.కె. నాయక్, ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ కోరారు. పాడేరు పర్యటనకు విచ్చేసిన ఆయన్ను శుక్రవారం కలిసి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఒకటే అసోసియేషన్ ఉండటం వల్ల ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించబడటం లేదన్నారు. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు వేర్వేరు అసోసియేషన్లు ఉన్నాయని, స్టీల్‌ప్లాంట్‌లోనూ ఆ విధంగా ప్రత్యేక అసోసియేషన్ ఏర్పాటు చేసేలా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

పాత అయ్యన్నపాలెంలో అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి ఉత్సవాలను శాతవాహన యువజన సంఘం ఆధ్వర్యంలో పాత అయ్యన్నపాలెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. గొందేశి నాగిరెడ్డి, గొందేశి పెంటయ్య, అప్పారావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భెల్ గేటు కోసం ఆందోళనలకు సిద్ధం


కుల సంఘాల పెద్దలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం వైపు గల భెల్ (హెచ్‌పీవీపీ) గేటు సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి నివాసంలో వార్డులోని కుల సంఘాల పెద్దలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దశాబ్దకాలంగా గ్రామం వైపు గల భెల్ గేటును తెరవాలని ఆందోళనలు చేస్తున్నామని, గేటు తెరిస్తే వేలాదిమందికి ప్రయోజనకరంగా ఉంటుందని కార్పొరేటర్ తెలిపారు. ఈ నెల 25 నుంచి మూడు రోజుల పాటు గేటు వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి సంస్థ యాజమాన్యంతో సమావేశం నిర్వహించి సమస్యను వివరించనున్నట్లు తెలిపారు. తర్వాత బీజేపీ ఎంపీ జీవీఎల్‌తో కూడా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై అవగాహన


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందించే వైద్యసేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత సేవలు పొందడం ఎలాగో వివరిస్తూ రూపొందించిన బ్రోచర్‌ను సచివాలయాల ఏఎన్‌ఎం మహాలక్ష్మి, వలంటీర్లు, ఆశవర్కర్ ఆవిష్కరించారు. సిబ్బంది, వలంటీర్లు గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి బ్రోచర్లు అందజేశారు. ఆరోగ్య సమస్యలున్నవారు ఇంటి నుంచే 104 కాల్‌సెంటర్ ద్వారా ఆరోగ్య సమస్యలు తెలియజేయవచ్చన్నారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా అందించే సేవలు, అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేయడం తదితర అంశాలను వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యసేవలు పొందాలంటే ఆస్పత్రికి ఏయే పత్రాలు తీసుకువెళ్లాలి, ఎవరిని కలవాలి, అక్కడ ఏయే వైద్య సేవలు అందిస్తారు అనే విషయాలను తెలియజేశారు. ఆస్పత్రుల్లో ఉచిత అందించే వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో పలు సచివాలయాలకు చెందిన ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ నాయకుడు అండిబోయిన అప్పారావు మాతృమూర్తి అప్పయ్యమ్మ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, అప్పారావు ఆధ్వర్యంలో వినాయకనగర్ వుడా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొన్నారు. అప్పయమ్మ చిత్ర పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్. రాజు, వెంపాడ అప్పారావు, వనుము నాగేశ్వరరావు, చప్పిడి నాగరాజు, గొరుసు సత్యం, మల్లెల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ వాసులకు అభినందన


పర్యావరణ పరిరక్షణపై బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్న కాలనీవాసులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న తిరుమలనగర్ కాలనీవాసులను జోన్-6 జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం అభినందించారు. తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మండపాలను శుక్రవారం సందర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ జీవీఎంసీ సూచనలను కాలనీవాసులు పాటించడం అభినందనీయమన్నారు. గణపతి ఉత్సవాల్లో మట్టి విగ్రహం ఏర్పాటు, పర్యావరణ హితంగా మండపాన్ని అలంకరించిన తీరు, ప్రసాదం పంపిణీకి వాడే కప్పులను పరిశీలించారు. ఆదివారం జరగనున్న అన్నసమారాధన కోసం స్టీల్ ప్లేట్స్, స్టీల్‌గ్లాసులు ఏర్పాటు చేయడంతో నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మెరిశారు

వివిధ విభాగాల్లో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


ఖోఖో, ఇతర క్రీడలకు ఎంపికైన అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు సత్తా చాటుతున్నారు. శుక్రవారం జరిగిన ఖోఖో అండర్ 14, 17 విభాగంలో బాలుర జట్లు విజేతలుగా నిలిచారు. అండర్ 17 విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎస్.సత్యకుమార్ విన్నర్‌గా నిలిచాడని స్కూల్ పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. 800 మీటర్స్ రన్నింగ్ ఈవెంట్‌లో ఎస్.రాజ్‌కుమార్ రన్నర్‌గా నిలిచాడన్నారు. కాగా అక్కిరెడ్డిపాలెం ఖోఖో జట్టులో అండర్ 17 విభాగంలో 7గురు, అండర్ 14 విభాగంలో 8 మంది క్రీడాకారులు ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలో పాల్గొంటారని తెలియజేశారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలుతీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురి కాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు,ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : ఏఎన్నార్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి నిర్వహించనున్న సౌత్ ఇండియా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నై, బెంగళూరు నుంచి సుమారు 120కి పైగా జట్లు హాజరు కానున్నాయని తెలిపారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచే జట్టుకు రూ.1.20లక్షలు, ట్రోఫీ, రెండో స్థానం సాధించే జట్టుకు రూ.70వేలు, ట్రోఫీ, మూడోస్థానం పొందిన జట్టుకు రూ.30వేలు, ట్రోఫీ అందజేస్తామన్నారు. ఆయా రాష్ట్రాల టీమ్ మేనేజర్లు నిర్వాహకులను సంప్రదించి జట్ల వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పల్లా త్రినాథ్, నరేంద్ర, రంజిత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపునకు వినతి

గాజువాక : జీవీఎంసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు మిస్ అయిన జీతాలను ఇప్పించాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు యూనియన్ నాయకులు సంబంధిత కార్మికులతో కలిసి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కలిసి వినతి పత్రం అందజేశారు. పారిశుధ్యం, నీటి సరఫరా, ఎంఎస్‌ఎఫ్ డ్రైవర్లతో పాటు మిగిలిన సెక్షన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల్లో ప్రతి నెలా ఒకరికో, ఇద్దరికో జీతాలు మిస్ అవుతున్నాయని పేర్కొన్నారు. పని చేసిన కార్మికులకు జీతాలు ఇప్పించడం కోసం ఆప్కోస్‌కు సప్లిమెంటరీ బిల్ పెడుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదని వివరించారు. దీనిపై వెంటనే స్పందించి జీతాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, లోకేష్, నక్క నాగరాజు, గణేష్, మీనాక్షి తదితరులున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం


దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 953వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఐక్య పోరాటాలతోనే విజయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి


ర్యాలీలో పాల్గొన్న జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ కమిషనర్ సింహాచలం కోరారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. 74వ వార్డు అంబేద్కర్ కాలనీలో శుక్రవారం ఆయన కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలసి పర్యటించారు. స్థానికులకు డ్రై డే పై అవగాహన కల్పించారు. వర్షాలకు నీరు నిల్వ ఉండి, దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వ్యాధుల ముప్పు ఉందన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు చెక్ చెప్పవచ్చని చెప్పారు. ఇళ్లలో వాడి పడేసిన కొబ్బరిబొండాలు, టైర్లు, ట్యూబుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీటి కుండీలను శుభ్రం చేసుకుని ఎండబెట్టుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, వెంకటరావు, శంకరరావు, జి.వి.రామారావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మహిళ



పోటీల్లో పాల్గొన్న అంజమ్మ

ఉక్కునగరం: మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మహిళ ఉబ్బోరు అంజమ్మ పాల్గొన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన 35వ మలేషియన్ అంతర్జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అంజమ్మ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (ఇండియా) తరఫున 55+ కేటగిరీలో డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావలిన్ త్రో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో షాట్‌పుట్ పోటీల్లో తృటిలో కాంస్య పతకం కోల్పోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం తరఫున అంతర్జాతీయ పోటీల్లో పాల్గోవడం ఆనందంగా ఉందని, అయితే అతి స్వల్ప దూరంతో కాంస్య పతకం కోల్పోవడం బాధగా ఉందన్నారు. రానున్న పోటీల్లో మరింత శ్రమించి దేశానికి పతకం సాధిస్తానన్నారు.

ముగిసిన క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్


విజేతకు సర్టిఫికెట్ అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు స్వామి, శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్ శుక్రవారం ముగిసింది. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఉక్కు మల్టీపర్పస్ హాలులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన కన్వెన్షన్‌లో దేశవ్యాప్తంగా 33 సంస్థల నుంచి 650 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ ఆర్. విజయశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగి ప్రమేయమే కార్యక్షేత్రంలో విజయానికి కీలకమన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు పతకాలు అందజేశారు. ఎల్ అండ్ టీ డిఫెన్స్ జీఎం అతుల్ కుమార్ శ్రీవాస్తవ, యోకోహామా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి. ప్రహ్లాదరెడ్డి మాట్లాడుతూ చిన్న గ్రూపు కార్యకలాపాలు సంస్థలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం, చాప్టర్ చైర్మన్ జి.గాంధీ, డాక్టర్ జీఎం కమోడర్ సంజయ్‌కుమార్, చాప్టర్ కార్యదర్శి సాగర్, స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు ఎస్.వి. స్వామి, యు.శ్రీధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల స్థాయి క్రీడా జట్ల ఎంపిక


క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

హోరాహోరీగా క్రీడా పోటీలు


షటిల్ బాడ్మింటన్ ఎంపిక జట్లతో నిర్వాహకులు


పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, మహాలక్ష్మినాయుడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో తలపడనున్న క్రీడా జట్ల ఎంపిక శుక్రవారం చేపట్టారు. పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా టోర్నమెంట్ కమ్ ఎంపికలు 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు పోటీలను ప్రారంభించారు. తరువాత క్రీడా కోర్టులను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించి ఉమ్మడి విశాఖ స్థాయిలో ఆడనున్న జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో లంకెలపాలెం, తానాం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రౌతు నాగేశ్వరరావు, శ్రీదేవి, అనకాపల్లి, విశాఖ జిల్లాల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు ఎం.వి.నాగేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ లక్ష్మీరాణి, పరవాడ మండల కో-ఆర్డినేటర్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, ఎలమర్తి వెంకటరావు, దాసరి తాతారావు, కాతా నూకేష్, కమిటీ చైర్మన్ కరణం సత్యవతి, వైస్ చైర్మన్ కోమటి వసంత, మూడు మండలాలకు చెందిన 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, 5 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయకుడు



సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో రాజగణపతి అలంకరణలో సంపత్ వినాయగర్ భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, సర్వదర్శనం అనంతరం నారాయణ సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.